ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: గ్రంథాలయంలో చిన్నారుల కు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో తాడు ఆటను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 20 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా గ్రంథాలయాధికారిణి సునీత మాట్లాడుతూ, సుమారు గత రెండు వారాల నుంచి ఈ క్యాంప్ ద్వారా చిన్నదారులకు పలు ఆటలు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వేసవి సెలవుల్లో చిన్నారులు బయట వెళ్లకుండా ఉండేందుకు ఈ క్యాంపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి కె.సుబ్బారావు, చిన్నారులు పాల్గొన్నారు.

తాడును లాగుతున్న చిన్నారులు

సకాలంలో విత్తనాలు పంపిణీ చేయండి

▶▶ వ్యవసాయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ▶▶ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీకి సంసిద్ధం కావాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కలక్టర్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల ద్వారా జూన్ ఒకటిన రూ. 75 లక్షల విలువగల వ్యవసాయ యంత్రపరికరాలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద పనులు లేని గ్రామాలు ఉండకూడదని, జిల్లాలో 567 గ్రామాలలో పనులకు సంబంధించిన సెల్ఫ్ ఏర్పాటు చేసి పనులు మంజూరు చేయించాలన్నారు. మరో 30 లక్షల పని దినాలు కల్పించాలని, సగటు వేతనం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు అండగా ఉండాలని జిల్లా కలక్టర్ ఆదేశించారు. వీరి పని తీరు బాగా లేదని, క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పటికీ కార్యాలయంలో రైతులకు కూడా అందుబాటులో ఉండాలన్నారు. అనేక సమస్యలపై సందేహ నివృతి కోసం వచ్చే రైతులకు అవగాహన కలిగే విధంగా వారితో మాట్లాడాలని ఆదేశించారు. గ్రామ సహాయకులు హాజరును వేసి ఫోటోలు జిల్లా వ్యవసాయాదికారికి పంపాలని, జిల్లా వ్యవసాయాదికారి ప్రతి రోజు వాటిని పిడీయఫ్ రూపంలో తనకు పంపాలని కలక్టర్ ఆదేశించారు. గ్రామ సహాయకుల సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహిస్తే సర్వీస్ నుండి తొలగించడానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు.

శాశన సభ్యురాలు కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మండలాల వారీగా రైతులకు బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించటంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాఫీ మొక్కలను నిజమైన లబ్దిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, సుమారు 4500 ఎకరాలలో గంజా పంట నుండి విముక్తి పొందిన రైతులకు ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని కోరారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సరస్వతి మాట్లాడుతూ గతంలో ఐటిడిఎ ద్వారా పవర్ వీడర్స్ కు డబ్బులు చెల్లించినప్పటికీ యంత్రాలు కొంతమందికి రాలేదని కలక్టర్ దృష్టికి తీసుకు రాగా కలక్టర్ స్పందిస్తూ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ను సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులకు సబ్సిడీ విత్తనాలను జిల్లా కలక్టర్, శాసన సభ్యులు, డి.ఎ.ఎ.సి ఛైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అందుబాటులో నాలుగు రకాల వరి విత్తనాలు ఉన్నాయని మరో ఏడూ రకాల విత్తనాలు రానున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు బి.ఎస్.ఎస్. నందు, పి రమేష్, డ్వామా పిడి రమేష్ రామన్, మార్కెటింగ్ ఎడి రాకేశ్, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంజాయి నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడుని అరెస్ట్ చేసినట్లు అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రుద్రశేఖర్ చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ముందుస్తు సమాచారం మేరకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో మండలంలోని సుంకరమెట్ట చెక్‌పోస్టు వద్ద అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ రుద్రశేఖర్ తన బృందంతో కలిసి ఎన్‌డిపిఎస్ కేసులో పరారీలో ఉన్న చిత్రకొండ ప్రాంతానికి చెందిన సూకూరి రమేష్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ నెల 22న 150 కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తి కారు, గంజాయి వదిలి పరారయ్యాడని శు క్రవారం అతన్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని మధాల పంచాయతి పరిధి దాబుగుడ, దోమలుజోరు తారు రోడ్డు పనులు పూర్తి చేయాలని శుక్రవారం గిరిజన సంఘం నాయకులు కోరారు. ఎంపిడిఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శేషాగిరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, మండల అధ్యక్షులు జి బుజ్జిబాబు, సంఘం పంచాయతీ కార్యదర్శి కె.రమేష్ మాట్లాడుతూ, మజ్జివలస జంక్షన్ నుండి దాబుగుడ దోమలజోరు గ్రామం వరకు 5 కిలోమీటర్లు వరకు 2014 లో తారు రోడ్డు మంజూరు అయ్యిందన్నారు. నేటి వరకు తారు రోడ్డు పూర్తి చేయకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేనప్పుడు అంబులెన్సు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్నా చేస్తున్న జిసిసి హమాలీలు

ఎరియర్స్ చెల్లించాలని జిసిసి హమాలీల ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

జీసీసీ హమాలీ కార్మికులకు పెండింగ్ ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీసీసీ కార్మికులు చింతూరు జీసీసీ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కమిటీ సభ్యులు అయ్యప్పస్వామి మాట్లాడుతూ 2022 జనవరి నుండి 2023 ఫిబ్రవరి వరకు క్వింటాకు పెంచిన రూ.3 ఎరియర్స్ రావాల్సి ఉందని తెలిపారు. వీటిని చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులకు ఎరియర్స్ ఇచ్చి జిసిసి హమాలీ కార్మికులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత నాలుగు రోజుల నుండి సమ్మె చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా పెండింగ్ ఎరియర్స్ చెల్లించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగార్జున, రాము, నాగు, చిట్టిబాబు, చంద్రయ్య, అప్పారావు, ముత్తయ్య, రమేష్, మంగరాజు, రామారావు, రాముడు, సీతారామయ్య, రామయ్య, రాఘవయ్య, భద్రయ్య, సురేష్, రాంబాబు, సుబ్బయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో నీటిని తోడుతున్న మహిళలు

తాగునీటి సమస్యతో సతమతం

ప్రజాశక్తి- ముంచింగి పుట్టు:మండల కేంద్రంలోని 12వ వార్డు రామాలయం వీధి లో తాగునీటి సమస్య నెలకొందని కించాయిపుట్టు వైస్ సర్పంచ్ పెనుమాల సరోజినీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బోరు బావి మరమ్మత్తులకు గురవ్వగా పైపులు తీసి వాటిని అమర్చడం మరిచి కొన్ని నెలలు గడుస్తున్నా అధికారులు కనీసం స్పందించ లేదన్నారు. సుజనకోట పంచాయతీ కుమ్మరి పుట్టు గ్రామంలో తాగునీరు లేక జోలాపుట్టు రిజర్వాయర్ గెడ్డలో కలుషితమైన నీటిని వినియోగించాల్సిన పరిస్థితి నెలకోంది. ఏనుగురై పంచాయతీలో తాగునీటి సమస్య నెలకొంది. తాగునీటి భావి మరమ్మత్తులకు గురైంది.అధికారులు స్పందించి తాగునీటిని అందించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరారు.

గర్భిణి అవస్థలు

108 రాకపోవడంతో ఆటోలో తరలింపు

ప్రజాశక్తి -హుకుంపేట::గర్భిణి తీవ్ర రక్తస్రావంతో అస్వస్థతకు గురి కావడంతో సొంత ఆటోలోనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించిన ఘటన హుకుంపేట మండల తీగలవలస పంచాయతీ వై గరుడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారంగా పాంగి రాంబాబు భార్య రాములమ్మ మూడు నెలల గర్భవతి ఆమెకు అకస్మికంగా తీవ్ర రక్తస్రావం ఏర్పడుతూ అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు గ్రామస్తులు 108 సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. అంబులెన్స్ గ్రామానికి రాకపోవడంతో అధిక రక్తస్రావం అవడంతో సొంత ఆటోలో ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, కుటుంబ సభ్యులు కలిసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.రహదారి సౌకర్యం ఉండి కూడా అంబులెన్స్ రాకపోవడం విశారకరమని సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు అన్నారు.

ఆటోలో తరలిస్తున్న బంధువులు


గాంధీబాబును సత్కరిస్తున్న టిడిపి నాయకులు రాజకుమారి తదితరులు

గాంధీబాబుకు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి-విఆర్.పురం

ఏజెన్సీలో సేవారంగంలో విశేష కృషి చేసినందుకు ఎఎస్‌డిఎస్ సంస్థ అధినేత వి.గాంధీబాబును ఈ నెల 25న విజయవాడలో ఎన్‌టిఆర్ సెంటనరీ స్మారక పురస్కారంతో సత్కరించారు. గాంధీబాబు కోవిడ్, అకాల వరదల సమయంలో నేనున్నానంటూ అన్నింటిల్లో ముందుడి ప్రాణనష్టం సంభవించకుండా సేవలు చేశారని నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, టిడిపి నాయకులు నన్నపనేని రాజకుమారి, బుద్దా వెంకన్న, వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు, డాక్టర్ కె.వేణుగోపాల్ రెడ్డి పాల్గొని అవార్డు ప్రదానం చేశారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలు

- జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-పాడేరు:గిరిజనులకు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సేవలు పారదర్శకంగా అందిస్తామని, ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోలు (జి. ఓ నెం.156,158 జారీ చేసిందని జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సేవలను అందించాలనే లక్ష్యంతో ఏజెన్సీ ప్రాంతంలోని చట్టాలు, రిజిస్ట్రేషన్ చట్టం 1908కి లోబడి పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని గిరిజనులకు భూముల రిజిస్ట్రేషన్, క్రయ విక్రయాలు, ఫర్మ్ రిజిస్ట్రేషన్, వివాహ రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో ఉన్న వెసులుబాటు అనుకూలంగా పాడేరులో ఏర్పాటు చేసిన ఐటినరేటింగ్ సెంటర్ను వి.మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రంప చోడవరంలో ఉన్న ఐటి రేటింగ్ సెంటర్‌ను కోరుకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఐటిన రేటింగ్ సెంటర్ రిజిష్టర్ కార్యాలయానికి బ్రాంచీ వంటిదని పేర్కొన్నారు. ఇప్పటికి రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతానికి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న కోరుకొండ సబ్ రిజిష్టర్ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందించడం జరుగుతోందని పేర్కొన్నారు. కోరుకొండ సబ్ రిజిష్టర్ కార్యాలయంలో అందించబడుతున్న సేవలు ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు ఏరియా భూ బదలాయింపు నియంత్రణ చట్టం 1959 (దానికి అనుసంధానమైన 1/70 చట్టం), ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ఏరియా భూ బదలాయింపు రూల్స్ 1969కి లోబడి సంబంధిత రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి జారీ చేయుబడిన ఫారం కె, ఫారం - ఎల్‌కి లోబడి రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తాయని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి. ఓ నెం. 156, 158ల అమలుపై జిల్లా కలెక్టర్, పాడేరు సబ్ కలెక్టర్, ఐటిడిఏ పిఓలతో చర్చించడ జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భూ బదలాయింపు చట్టాలకు పూర్తిగా లోబడి సేవలు అందించాలని ఆదేశించారని పేర్కొన్నారు.రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తుల వివరాలు, సర్టిఫైడ్ కాపీలు అందుబాటులో ఉంటాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది, వ్యాపారులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరకు వారపు సంతలో స్థానిక అటవీ శాఖ రేంజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శు క్రవారం అటవీ ఉత్పత్తులు, పర్యావరణ పరిరక్షణపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులతో జరిగే నష్టాలు, పరిసరాల పరిశుభ్రతపై గిజనులకు అవగాహన కల్పించడంతో పాటు గిరిజన ప్రాంతంలో లభించే అటవీ ఉత్పత్తులైన అడ్డాకులు, చింతపండు, కాఫీ, మిరియాల పంటలతో పాటు కొండ చీపుర్లు, కూరగాయల వంటి వాణిజ్య పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఫారెస్ట్ అధికారులు రామారావు, పోతురాజు పడాల్, కృష్ణం నాయుడు, పి.ఉద్దంగి, రేణుక, రామచంద్రరావు, మౌనిక పాల్గొన్నారు.

భానుడి భగభగతో ప్రజలు బెంబేలు

నిర్మానుష్యంగా మారిన మండల కేంద్రం

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్ కేంద్రంలో గత 10 రోజులు నుండి ఉష్ణోగ్రతలు భారీ స్థాయిలో పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వరుసగా ఉష్ణోగ్రతలు 42, 47, 48 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బయటికి రావడానికి భయపడుతున్నారు. భానుడి భగభగలు రోజురోజుకు అధికం కావడంతో రోజువారి కూలీలు, కార్మికులు పనులకు వెళ్లేందుకు సైతం వెనకాడుతున్నారు. రోహిణి కార్తీ ప్రారంభం కావడంతో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతున్నాయి. శుక్రవారం 42 డిగ్రీలకు చేరింది. ఎండ తాకిడికి ప్రజలు బయటికి రాకపోవడంతో మండల కేంద్రంలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బావుల్లో నీరు అడుగంటి పోయింది. చేతిపంపుల్లో నీరు లేక మొరాయిస్తున్నాయి. పశుపక్షాదులు ఎండ వేడిమికి తాళలేక కొట్టుమిట్టాడుతున్నాయి. అధిక వేడితో కూడిన వడగాల్పులు వీచటంతో చిరు వ్యాపారులు అస్వస్థలకు గురి అవుతున్నారు. నాలుగు రాష్ట్రాల ప్రధాన కూడలి అయిన చింతూరు మండల కేంద్రంలో కనీసం రెండు మూడు అయినా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తే వాహన చోదకులకు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. మండల కేంద్రంలో నిలువ నీడ లేకుండా చెట్లు కూడా లేకపోవడంతో మార్కెట్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత వారం రింగల గ్రామంలో వడదెబ్బ తగిలి ఒక వ్యక్తి మృతి చెందాడు. వేసవి ముగిసే వరకు మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీటి సౌకర్యం ప్రభుత్వం కల్పించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న చింతూరు మార్కెట్ రోడ్డు

విరిగిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించండి

ప్రజాశక్తి-కూనవరం

ఇటీవల ఈదురుగాలులు కారణంగా మండలంలోని కూటూరు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన రెండు స్తంబాలు పడి పోయాయని, వాటిని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ స్తంబాలు పడిపోయిన సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించి కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రీ పేస్ కరెంట్ ఇస్తున్నామని చెప్పడం తప్ప ఎప్పుడూ లోవోల్టేజీ సమస్యలేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ వోల్టేజ్ సరిపోక మోటార్ల ద్వారా నీటి పంపు నుంచి నీరు రావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోతే విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

విరిగిన విద్యుత్ స్తంభం

సచివాలయ కార్యదర్శులకు అధికారాలివ్వాలి

సిపిఎం ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

గ్రామ సచివాలయ కార్యదర్శులకు సర్వ అధికారాలు ఇవ్వాలని సిపిఎం మండలం కార్యదర్శి, గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శు క్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒక్కొక్క పంచాయతీకి ఒక్కొక్క డిడిఓ ఉండాల్సి ఉండగా, జికె.వీధి మండలంలో రెండు మూడు పంచాయతీలకు ఒక డిడిఓ ఉన్నారని తెలిపారు. దీంతో వారు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. పంచాయితీకి వస్తున్న ఆర్థిక లావాదేవీలు, మూడు నెలలకు ఒకసారి జరిగే గ్రామసభలో తెలియజేయడానికి డిడిఓలు హాజరు కావడం లేదన్నారు. దీని వలన ప్రజలకు ఏమి తెలియటం లేదని విచారం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎంపిడిఓ దృష్టికి తీసుకెళ్లినా మారుమూల గాలికొండ, ఎ.దారకొండ, దుప్పులవాడ, మొండిగెడ్డ పంచాయతీలను పట్టించుకొనే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సచివాలయ కార్యదర్శులకు పంచాయతీకి చెందిన సర్వ అధికారాలు ఇవ్వాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాలికొండ సర్పంచ్ కాకురు బుజ్జి బాబు, ఎ.దారకొండ సర్పంచ్ ముర్ల సత్యవతి చంటి, వార్డు మెంబర్ గుంటా ఆనంద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని బోర్నగూడెం గ్రామంలో రక్షిత తాగునీటి పథకం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు చెరుకుంపాలెం సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు శు క్రవారం శంకుస్థాపన చేశారు. రూ.17లక్షలు సీసీడీపీ నిధులతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను నిర్మాణం చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, వైసీపీ నాయకులు ఎ.రవి, ఎస్.రవి, ఎ.రాంబాబు, ఎం.సత్తిబాబు, డి.ఏసుబాబు, ఎన్.గణేష్, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

బీడీ ఆకు కాంట్రాక్టర్లు, కార్మికుల మధ్య కుదిరిన ఒప్పందం

ప్రజాశక్తి చింతూరు

చింతూరు డివిజన్ పరిధి చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల్లోని తునికాకు యూనిట్ల పరిధిలో ఉన్న అన్ని కల్లాల్లో పని చేస్తున్న కల్లేదారులు, అక్కడ జరుగుతున్న ఇతర పనులకు సంబంధించి రేట్లపై కాంట్రాక్టర్లు, కార్మికుల మధ్య శుక్రవారం ఒప్పందం జరిగింది. కల్లేదారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, బీడీ కాంట్రాక్టర్లు కలిసి చర్చించుకొని చేసిన ఒప్పందం ప్రకారం రేట్లు అమలు జరపాలని నిర్ణయించారు. దీని ప్రకారం 2022లో కల్లేదారు కమిషన్ స్టాండర్డ్ బ్యాగుకు రూ.105 ఉండగా కొత్త ఒప్పందం ప్రకారం రూ.118, స్టాండర్డ్ బ్యాగు భర్తీ రూ.63 నుండి రూ.69, రౌండ్ కుర్చీలు రూ.10 నుండి రూ.12, ఒక్కసారికి రూ.22 నుండి 23, జట్కా ఒకసారికి రూ.30 నుండి రూ.31, జట్కా చేసిన కట్ట పడుకోబెట్టడానికి రూ.12 నుండి రూ.13, సాలు కుర్చీలు రూ.20 నుండి రూ.21, బస్తాలు నెట్టి కట్టినందుకు రూ.9 నుండి రూ.10, భూమి అద్దె రూ.850 నుండి రూ.900, తాడు పట్టుటకు రూ.800 నుండి రూ.850, భూమి శుభ్రం చేసినందుకు రూ.900 నుండి రూ.950 చెల్లించాలని ఒప్పందం జరిగింది.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

నినాదాలు చేస్తున్న హమాలీలు, గిరిజన సంఘం నాయకులు.

ప్రజాశక్తి- అరకులోయ:గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కారం చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్ డిమాండ్ చేశారు.అరకు బ్రాంచ్ లో నాలుగు రోజులనుంచి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్, మండల కార్యదర్శి పి.రామన్న, ఉపాధ్యక్షులు కె.రామారావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ,జిసిసి హమాలీలకు 13 నెలల ఏరియర్స్ బకాయిలు చెల్లించి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదవసత్తు మరణించిన కార్మికులకు రూ.20 లక్షల ఎక్స్గ్రేషియా, దహన సంస్కరణ ఖర్చులకు రూ.25000, హమాలీలకు సంవత్సరానికి నాలుగు జతల యూనిఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్రాంచుల వద్ద మంచినీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిసిసి హమాలీల సంఘం నాయకులు పరశురాం, చందు, నానాజీ, అర్జున్, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై వరి విత్తనాలు

వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి, జెడ్పిటిసి

ప్రజాశక్తి-హుకుంపేట: హుకుంపేట పంచాయతీ దాలి గుమ్మడి గ్రామంలో శుక్రవారం ఎంపీపీ కూడా రాజబాబు, జెడ్పిటిసి రేగం మత్స్యలింగం, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ముత్యాంగి విశ్వేశ్వరరావుల. చేతుల మీదుగా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఆఫీసర్ సరోజిని మాట్లాడుతూ, 90శాతం రాయితీ పైన వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట సర్పంచ్ సమిడ పూర్ణిమ, డిస్ట్రిక్ట్ అగ్రి అడ్వైజరీ బోర్డు మెంబర్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలో గుల్లెలు గ్రామం లో మాజీ జడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ సతీమణి తలుపులమ్మ (65) గురువారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో నాగు పాము కాటు వేయడంతో మృతి చెందారు. పాముకాటుతో మెలకువ వచ్చిన ఆమెను కుటుంబ సభ్యులు గోమాంగి హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడజంతో పాడేరు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.వైస్సార్సీపీ నాయకులు గంపరాయి సూరయ్య, మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, అనంతరావు, కొండబాబు, మొగలిపూరి తదితరులు మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణను పరామర్శించారు.

22 రోజులు ముఖ హాజరు వేస్తేనే జీతాలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు:నెలలో 22 రోజులు ముఖ హాజరు వేస్తేనే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జిల్లా శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్పందనలో స్వీకరించిన లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ సూచించారు. శుక్రవారం స్పందన కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, స్పందన పై నమ్మకంతో ప్రజలు అర్జీలు అందజేస్తున్నారని బాధ్యతగా వ్యవహరించి సమస్యల పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. స్పందన అర్జీలను సంబంధిత శాఖలకు పంపిస్తున్నామని ఫిర్యాదులు డిపార్ట్మెంట్కు చేరిన ఒకరోజు వ్యవధిలో విచారణ అధికారిని నియమించాలని సూచించారు. ఆ విచారనాధికారి అర్జీదారుల ఇంటికి వెళ్లి పరిష్కార మార్గం చూపాలని చెప్పారు.ఉద్యోగులు సమయపాలన పాటించాలని అన్నారు. ముఖ హాజరు లేకుండా జీతాలు చెల్లిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ డిఆర్ఓ పి.అంబేద్కర్ పి ఆర్ ఈ ఈ కొండయ్య పడాల్ ఆర్ అండ్ బి ఈఈ బాల సుందర బాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బిఎస్ నంద్, జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డిఎల్‌పిఓ పిఎస్ కుమార్ తహసిల్దార్లు పాల్గొన్నారు.

స్పందనకు 85 అర్జీలు...

ఐటీడీఏ లో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు నుండి 85 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ముంచంగిపుట్టు మండలం బంగారు మెట్ట పంచాయతీ సర్వపుట్టు గ్రామస్తుడు జాగారపు భీమరాజు తనకు ఇల్లు మంజూర అయ్యిందనిపునాదుల బిల్లు మంజూరు చేయాలని అర్జీ దాఖలు చేశారు. పెదబయలు మండలం పెదకోడపల్లి పంచాయతీ మెరక చింత గ్రామానికి అంగన్వాడి కేంద్రం మంజూరు చేయాలని గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. జిసిసి హమాలీలకు 13 నెలల ఏరియర్స్ బకాయిలు చెల్లించాలని హమాలీల సంఘం నాయకులు పండు బాబు తదితరులు వినతిపత్రం అందజేశారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ వంక రాయి, సంపంగి బంధ గ్రామాలకు నాలుగు కిలోమీటర్ల మట్టి రోడ్డు పనులు పూర్తి చేశాక అటవీ అధికారులు అభ్యంతరం పెడుతున్నారని గ్రామస్తులు విన్నవించారు.

నేత్రదానం, సంరక్షణపై అవగాహన

నేత్ర సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న మురళీమోహన్

ప్రజాశక్తి- విశాఖపట్నం : మరణానంతరం ఈ లోకాన్ని మళ్లీ చూడగలగడం, మరొకరికి కంటిచూపునివ్వడం నేత్రదానంతోనే సాధ్యమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ శాఖ కోశాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పెద జాలరిపేటలో నేత్ర దానం, నేత్ర సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటిచూపు కాపాడుకోవడానికి ఆకు కూరలు, గుడ్లు, పాలు, క్యారెట్, బొప్పాయి వంటి ఆహారపదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిదన్నారు.

అలాగే కంటిచూపును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. ఒక కన్ను తెరిచి, మరో కన్ను మూసి ఉంచి దృష్టిని పరీక్షించుకోవాలని సూచించారు. తద్వారాతెలిపారు. ఏ కంటి చూపులో సమస్య ఉందో గుర్తించి, దానికి అనుగుణంగా నేత్ర వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స తీసుకోవచ్చన్నారు. నిద్ర నుంచి లేచిన వెంటనే సాధారణ నీటితో ముఖం కడుక్కోవాలని సూచించారు. 45ఏళ్ల పైబడిన వారు, కుటుంబంలో ఎవరికైనా గ్లకోమాచరిత్ర ఉన్నవారు ఆరునెలలకోసారి విధిగా కంటిపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మరణించిన తర్వాత కనీసం నలుగురికి చూపు ఇవ్వగల నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. ఆవో గావ్‌చాలో భాగంగా ప్రజలకు ఆరోగ్య సమస్యలపై నిర్వహించిన అవగాహనలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బృందం పాల్గొంది.

2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం సన్నాహాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం: ఉక్కునగరంలో వచ్చేనెల 2న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు వెల్లడించారు..శుక్రవారం ఉక్కునగరంలో నిర్వహించిన సంఘం సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షులు ఎన్.కుమారస్వామి మాట్లాడుతూ ఏటా స్టీల్‌ప్లాంట్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది దశాబ్ది ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఈ ఏడాది దశాబ్ది ఆవిర్భావ వేడుకలను అన్నీ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎన్. నర్సింగరావు, తాండ్ర కనక రాజు, టి.ప్రభాకర్, సిహెచ్. రవికుమార్, బాలాజీ, పరమేష్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

ప్రజాశక్తి పాడేరు: ఎస్‌హెచ్‌జి మహిళలు బ్యాంకు లింకేజీ సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో పాడేరు మండలానికి చెందిన 54 ఎస్ హెచ్‌జిలకు యూనియన్ బ్యాంక్ అందించిన బ్యాంక్ లింకేజీని చెక్ ద్వారా సంఘ సభ్యులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంకు లింకేజీ ద్వారా పొందిన ఆర్థిక సాయంతో ఏ రకమైన వ్యాపారాలు చేస్తారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. లాభసాటి వ్యాపారాలు చేసుకుని తిరిగి సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి మురళి, లీడ్ బ్యాంకు మేనేజర్ రవి కిరణ్, ఏపీఎంలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు నిధులు విడుదల చేయాలి

నినాదాలు చేస్తున్న కొండలరావు, గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో భూర్జా పంచాయతీలోని సులిపకన్, ఎగసల్తాంగి, దిగ సల్తాంగి, ఊట గెడ్డ, కొండయ్యపాడు గ్రామాలకు తారు రోడ్లకు నిధులు విడుదల చేయాలని సీపీఎం వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు డిమాండ్ చేశారు. సులిపకోన్ గ్రామంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, తారు రోడ్లు లేక పోవడంతో మారుమూల గ్రామాలకు అంబులెన్స్ రాలేదని, దీంతో డోలి మోతలతో అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. తరలించే సమయంలో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

10న గీతం స్నాతకోత్సవం

29లోగా స్నాతకోత్తర పట్టాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవాన్ని వచ్చేనెల 10 నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. గీతం స్నాతకోత్సవాన్నికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. గీతం విశాఖ ప్రాంగణం నుంచి 2023-23 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, నర్సింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, సామాజిక శాస్త్రం వంటి కోర్సులను పూర్తిచేసి, పట్టభద్రులు, పరిశోధక విద్యార్థులు స్నాతకోత్తర పట్టాలను అందజేస్తారన్నారు. స్నాతకోత్తర పట్టాల కోసం ఈనెల 29వ తేదీలోగా గీతం వెబ్‌సైట్ www.gitam.edu ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంచండి

ప్రజాశక్తి-సింహాచలం: ప్రభుత్వ ఉద్యోగుల వలే దేవాలయ ఉద్యోగులకు కూడా ఉద్యోగ విరమణ వయస్సును అరవై ఏళ్ల నుంచి 62ఏళ్లకు పెంచాలని దేవాదాయశాఖ ఉద్యోగులు కోరారు. శుక్రవారం సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తీర్చాలని కోరారు.

ఈ సందర్భంగా సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టితోపాటు ఎపిపి మెంబర్ సెక్రటరీ బి శ్రీధర్ దంపతులు, ఇతర ప్రముఖులకు ఆలయ ఎఇఒ వై శ్రీనివాసరావు ఆలయ సంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ, స్వామి యంత్రాలయంలోనూ గోదాదేవి సన్నిధిలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించిగా, అధికారులు స్వామిప్రసాదాన్ని అందించారు.

డిజిటల్ పాపులేషన్ క్లాక్ ప్రారంభంలో ఎస్ఆర్.మీనా, ప్రసాద్‌రెడ్డి తదితరులు

ఎయులో డిజిటల్ పాపులేషన్ క్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిజిటల్ పాపులేషన్ క్లాక్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎయు పాపులేషన్ రీసెర్చ్ సెంటర్, భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ క్లాక్ సేవలను అందుబాటులోకి తెచ్చాయి. 10 సెకండ్లకు ఒకసారి అప్డేట్ అవుతూ దేశ, రాష్ట్ర జనాభాలను ఈ డిజిటల్ పాపులేషన్ క్లాక్ తెలియజేస్తుంది. భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ (స్టాటస్టిక్స్) ఎస్ఆర్.మీనా, ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డిలు ఈ డిజిటల్ క్లాక్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులతో పాటు సామాన్యులకు దేశ జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించేందుకు ఈ డిజిటల్ క్లాక్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఎయు పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ద్వారా మంత్రిత్వ శాఖకు అందుతున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఎయు సెంటర్‌కు మరిన్ని ప్రాజెక్టులను అందించడంతో పాటు కేంద్రంలో ఉద్యోగుల సంఖ్య పెంచనున్నట్లు వెల్లడించారు. విసి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 1977 నుంచి ఎయు పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ద్వారా సమాజానికి విలువైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విభాగానికి చెందిన ఆచార్య సిఆర్.రావుకు నోబుల్‌కు సమానమైన అవార్డు లభించిందన్నారు. కార్యక్రమంలో ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎయు పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ గౌరవ సంచాలకులు ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య షారోన్ రాజు పాల్గొనానరు.

కూలి రేట్లు పెంచండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసి కార్గో లైసెన్సు కళాసీల కూలిరేట్లను తక్షణం పెంచాలని ఎపిఎస్ ఆర్‌టిసి లైసెన్సుడ్ పోర్టర్స్ కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ డిమాండ్ చేశారు. పలు సమస్యలపై శుక్రవారం ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలి రేట్ల కాలపరిమితి ముగిసి ఆరు మాసాలు అయిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నూతన ఒప్పందం చేయాల్సిన ఆర్‌టిసి పిడిటి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. లైసెన్స్‌డ్ పోర్టర్లకు పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. వీరందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, పని భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఆర్ఎం అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోటాను ఆనంద్, ఎఐటియుసి నాయకులు అడ్డూరి శంకర్, కార్మికులు కె.సత్యనారాయణ, రామునాయుడు, అక్కునాయుడు, ఆర్.అప్పలనాయుడు, దేవుడుబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

30న యుపిఎస్‌సిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ పరీక్షలపై జరుగనున్న అవగాహన సదస్సును యువత సద్వినియోగం చేసుకోవాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత పరీక్షలపై అపోహలు వీడి ముందుకు సాగాలని కోరారు. ఈ నెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగనున్న యుపిఎస్‌సి సదస్సులో విద్యార్థులు పాల్గొని అవగాహన పెంచుకోవాలన్నారు. యువతకు మేలు చేసే కార్యక్రమాలకు తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ సదస్సు సందర్భంగా విశాఖపట్నం నుంచి సివిల్స్‌కు ఎంపికైన కె.సాహిత్య, ఎన్.ఆశ్రితలను సన్మానించనున్నట్టు తెలిపారు.

జెడ్‌పి నిధులపై కోల్డ్ వార్..!

సమావేశానికి రాని ఎమ్మెల్యేలు
బయటపడ్డ అసంతృప్తులు

ఇటీవల జరిగిన జెడ్‌పి సమావేశంలో కానరాని ఎమ్మెల్యేలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేల తీరుపై జెడ్‌పిటిసిలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ సాధారణ నిధుల కేటాయింపులో అధికార పార్టీ ఎమ్మెల్యేల జోక్యంపై వారు అభ్యంతరం తెలుపుతున్నారు. జెడ్‌పి సాధారణ నిధులను 2021-22లో రూ.15 లక్షలు, 2022-23లో రూ.13 లక్షలు చొప్పున జెడ్‌పిటిసిలకు ఛైర్‌పర్సన్ సుభద్ర కేటాయించారు. జెడ్‌పి సాధారణ నిధులనైనా కేటాయించాలని జెడ్‌పిటిసిలు కోరడంతో ఆ రెండేళ్లలో 28 లక్షలను ఒక్కొక్క జెడ్‌పిటిసికీ ఆమె కేటాయించారు. జెడ్‌పి నిధులను ఇలా వీరికి కేటాయించడం ఎమ్మెల్యేలకు ఇష్టంలేదు. తమ చేతుల మీదుగా ఖర్చు చేయాలని కొందరు ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ నిర్ణయంతో మండలంలోని రోడ్లు, కాలువలు, అంగన్‌వాడీ భవనాలు, బోర్లు, శ్మశాన వాటికలు, రచ్చబండల అభివృద్ధి వంటి చిన్న చిన్న పనులకు నిధుల కోసం ఎమ్మెల్యే, ఎంపీలపై ఆధారపడకుండా, కేటాయించిన నిధులను ప్రాధాన్యతను బట్టి వినియోగించే అవకాశం జెడ్‌పిటిసిలకు లభించింది. ఇక్కడే ఎమ్మెల్యేలు, జెడ్‌పిటిసిల మధ్య కోల్డ్‌వార్ ప్రారంభమైంది. జెడ్‌పి నిధులను తమ ద్వారా ఖర్చు చేయాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతుండగా, చిన్నచిన్న పనులు చేసేందుకు కూడా నిధుల్లేకపోతే ప్రజల్లో తమకేం విలువ ఉంటుందని జెడ్‌పిటిసిలు ప్రశ్నిస్తున్నారు. జెడ్‌పిటిసిలకు నిధులు కేటాయించడంపై ఛైర్‌పర్సన్ సుభద్రపై కొంతమంది ఎమ్మెల్యేలు గుర్రుమంటున్నారు. జెడ్‌పి నిధులపై ఎమ్మెల్యేలు, ఛైర్‌పర్సన్ మధ్య సాగుతున్న అంతర్గతపోరు ఈ నెల 23న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యేలు గైర్హాజరవడంతో బయటపడింది. మా మధ్య నిధులకు సంబంధించి వివాదమేదీలేదని జెడ్‌పిటిసిలు చెబుతున్నప్పటికీ, తమ మాట వినకుండా వారికి నిధులు కేటాయించడంతో సమావేశానికి రాకుండా ఎమ్మెల్యేలు నిరసన తెలిపారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

జెడ్‌పి సాధారణ నిధులు ఎమ్మెల్యేల ద్వారా ఖర్చు చేయాలని యలమంచిలి, భీమిలి ఎమ్మెల్యేలు యువి.రమణమూర్తిరాజు (కన్నబాబు), ముత్తంశెట్టి శ్రీనివాసరావు గట్టిపట్టుపడుతున్నట్లు తెలిసింది. వీరికి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు తోడైనట్లు ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మినహా మిగిలిన ఎమ్మెల్యేలెవరూ ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశానికి హాజరుకాలేదు. జిల్లా పరిషత్ సమావేశానికి గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేలెవరూ హాజరుకాకపోవడం ఇదే మొదటసారి. దీనికి జెడ్‌పి నిధుల కేటాయింపుపై కొంతకాలంగా జరుగుతున్న కోల్డ్‌వార్ కారణమని తెలుస్తోంది.

ఇఎస్ఐ ఆసుపత్రిలో..

మెరుగైన వైద్యం కోసం కార్మికుల ధర్నా



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ములగాడ : మల్కాపురంలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హాస్పిటల్ వద్ద ధర్నా నిర్వహించారు. దీనికి పెద్ద సంఖ్యలో హాజరైన కార్మికులనుద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మల్కాపురం ఇఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. స్టీల్‌ప్లాంటు సహా వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ప్రమాదానికి గురై చికిత్స కోసం మల్కాపురంలోని ఇఎస్ఐ ఆసుపత్రికి వస్తే నిరాశే మిగులుతోందన్నారు. మెడికల్ లేబొరేటరీ, ఎక్స్‌రే, స్కానింగ్, ప్రాథమిక పరీక్షలు కూడా కరువయ్యాయన్నారు. కాంట్రాక్టు కార్మికుల నుంచి వేల కోట్ల రూపాయలు ప్రభుత్వాలకు ఇఎస్ఐ కోటా కింద చేరుతున్నా సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. మల్కాపురం ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య పరికరాలు లేకపోవడంతో డ్యూటీ డాక్టర్లు సాధారణ ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని, ఇది తీవ్ర అన్యాయమని అన్నారు. కార్మికులు తమ సొంత డబ్బులు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక కష్టాలు అనుభవిస్తున్నారన్నారు. సూపర్ స్పెషాలిటీ, సెకండరీ కేర్ రెఫరల్ సదుపాయాన్ని వెంటనే విశాఖ నగరంలోని ఒకే ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలన్నారు. ఇఎస్ఐ చట్ట ప్రకారం అన్ని డిస్పెన్సరీల్లో తగినంత సిబ్బంది, అన్ని రకాల వైద్య సదుపాయాలు, మందులు ఉండాలన్నారు. మల్కాపురం గాంధీ గ్రాంలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, టిబి వార్డులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇన్ పేషెంట్లకు డైట్ సదుపాయం కల్పించాలని, సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలని అన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ విభాగాల్లో వైద్యులను నియమించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

బోరు మరమ్మతులు చేస్తున్న ఎంపిటిసి రామన్న

బోరు మరమ్మతులు చేసిన ఎంపిటిసి

ప్రజాశక్తి - సీలేరు : జీకే.వీధి మండలం దారకొండ పంచాయతీ కొంగపాకలో బోరుబావి పాడైపోవడంతో స్థానిక ఎంపిటిసి రామన్న స్వయంగా మరమ్మతులు చేశారు. బోరుబావి పాడైపోవడంతో గ్రామస్తులు మంచినీటికి కటకటలాడుతున్న విషయం ఎంపీటీసీ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన బోర్ మెకానిక్‌గా అవతారమెత్తి బోరుబావి మరమ్మతు పనులు స్వయంగా ఆయన గ్రామస్తులతో కలిసి చేశారు. ఎట్టకేలకు బోరుబావి నుంచి నీరు వచ్చింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా స్వయంగా బోరు మరమ్మతులు చేసిన రామన్నకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

29న గ్రామ వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఈనెల 29వ తేదీన గ్రామ వాలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ రోజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ జి.మాధవి హాజరవుతారని, మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు శ్రీను

మహానాడు విజయవంతానికి కృషి

ప్రజాశక్తి - విఆర్.పురం : రాజమహేంద్రవరంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం మహానాడు జయప్రదానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీను పిలుపునిచ్చారు. మండల కేంద్రం రేఖపల్లిలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు అధ్యక్షతన జరిగిన సమావేంలో వారు మాట్లాడుతూ ప్రతి ఊరి నుండి అభిమానులు కదిలే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటిసి ముత్యాల రామారావు, ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, బీరక సూర్యప్రకాశ్‌రావు, ముత్యాల చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యులు రహీమ్, వేట్ల ముత్యాలరెడ్డి, కారం సిరమయ్య, ముత్యాల కోట్ల బాలయ్య, ముత్యాల రాంబాబు, ముత్యాల రమేష్, సురేష్ పాల్గొన్నారు.